

పోయాడు. వాస్తవానికి రవికి ఆడపిల్లలతో ఏకాంతంగా మాట్లాడటం ఎంతో సిగ్గు. అంతకన్నా ఎక్కువ భయంకూడా.

తనని ఒకళ్ళు చెడుగా భావిస్తే సహించలేని మనస్తత్త్వం రవిది. అందుకే తన ప్రవర్తనని చాలా కంట్రోలులో పెట్టి అందరితోనూ ఎంత చనువుగా ఉంటాడో, అంత హద్దులలోకూడా ఉంటాడు. ముఖ్యంగా రవి మంచి నడవడీ, మర్యాద—ఇవన్నీ అతని బంధువులంతా ఎంతో గౌరవిస్తారు. అలాంటి రవి అవి కాపాడుకోవడానికి ఎంతో ప్రత్యేక శ్రద్ధతో ప్రవర్తిస్తూంటాడు.

రవి గీతకు ఎదురుగా కూర్చున్నాడు. గీత పక్కన పద్మ కూర్చుంది. అక్కడ మరెవ్వరూ లేరు. రవి సిగరెట్టు వెలిగించాడు. ఆకాశంలో చీకటిగా ఉంది. అక్కడక్కడ "మేముకూడా ఉన్నాము" అన్నట్టుగా నక్షత్రాలు మెరుస్తున్నాయి.

"ఒరేయ్, రవి! నాకు ఎలా చెప్పాలో తెలియడం లేదురా! తప్పయితే క్షమించు! గీతని నువ్వు పెళ్ళి చేసుకుంటావా? ఈ విషయం తను అడగటానికి ధైర్యం చాలక నన్ను అడగమని కోరింది. నేను కూడా నీ దగ్గర నా కున్న చనువు వల్ల గీత కోరగానే కాదనలేకపోయాను. నీవు బాగా ఆలోచించుకుని నీకు ఇష్టమైతేనే చెప్పు! ఇందులో నే నేమీ ఫోర్సు చేయటం లేదు. 'గీత' నా దగ్గరకు వచ్చి నన్ను ఈ విషయం అడగమని రిక్వెస్ట్ చేసింది. నేనుకూడా ఆశ్చర్యపడ్డాను! నన్ను మరోలా భావించకు! ఇది నీ జీవిత సమస్య. నీవు బాగా ఆలోచించుకుని నీ నిర్ణయం చెప్పు! గీత మాత్రం నిన్ను మనసారా ప్రేమించిందిట! పెళ్ళంటూ చేసుకుంటే నిన్ను తప్ప మరెవ్వరినీ చేసుకోదుట. వచ్చినప్పటి నుండీ నిన్ను అడగాలని ఎంతో ప్రయత్నించిందిట! కాని. . . ఎలా అడగాలో తెలియక అడిగే ధైర్యం చాలక, నన్ను అడగమని కోరింది. ఇదీ సంగతి" అంటూ చిరునవ్వుతో సింపుల్‌గా ముగించింది పద్మ.

రవి సిగరెట్ పొగ గాలిలో దీర్ఘంగా విడుస్తూ, ఆకాశంలోకి అలా చూస్తున్నాడు. గీత నిశ్శబ్దంగా, సవినయంగా తల వంచుకుని రవి అభిప్రాయంకోసం ఎదురుచూస్తూంది.

క్షణకాలం నిశ్శబ్దం!

"అక్కా! అదేమిటి సడెన్‌గా అలా అడిగేశావు?" అన్నాడు రవి మనసులో ఆలోచిస్తూనే.

"అదేమో 'నువ్వు అడుగు' అని నన్ను బలవంతం చేసిందిరా! ఎలా అడగాలో నాకు అర్థం కాలేదు! నేను కథల్లోనూ, సినిమాల్లోనూ చదివాను, చూశాను గాని, ప్రాక్టికల్‌గా ఇలాంటి సంఘటన చూడడం ఇదే మొదటిసారిరా! నేను నీ కన్నా పెద్దదాన్నే అయినా, ఇలాంటి విషయం నీతో ఎలా అడగాలా అని ఎంతో సంశయించాను. కానీ, మధ్యాహ్నం నించీ గీత నన్ను ఎంతో వేధించింది. తాను అడగలేదు, నన్ను అడగమని ఎంతో రిక్వెస్ట్ చేసింది. సరే, దాని పోరు పడలేక నేనుకూడా ధైర్యం చేశాను. మరో విషయం. గీత వాళ్ళ ఫేమిలీ గురించి నీకు అంతగా తెలియదనుకుంటాను. అయినా, చెప్పడం నా ధర్మం. నిజానికి అదే నన్ను చెప్పమందికూడా! వాళ్ళ కుటుంబంకూడా మన లాగే మధ్యతరగతి కుటుంబం. బాగాఉన్నవాళ్ళు కాకపోయినా, మన లాగే దేనికీ లోటు లేదు. వాళ్ళ నాన్న కట్నాలూ, కానుకలూ నీ హోదాకి తగ్గట్టు ఇవ్వలేకపోయినా వాళ్ళ శక్తి కొలదీ మధ్యతరహాగా ఇస్తారు. పెళ్ళి కూడా ఎంతో హోదాలో చెయ్యలేకపోయినా దేనికీ లోటులేకుండా సామాన్యంగా చేస్తాడు. కానీ, గీత మాత్రం నిన్ను మనసారా ప్రేమించిందిట! నిన్ను ఎలాగైనా ఒప్పించి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుందిట! ఇక నీవు ఆలోచించుకుని నీ అభిప్రాయం చెప్పు. ఇది కేవలం నీ పెర్సనల్ విషయం; నీ జీవితసమస్య. నాకు తెలిసినంతవరకూ గీతా వాళ్ళది చాలా మర్యాద గల కుటుంబం. అదికూడా మంచి నడవడికగల పిల్ల. ఇందులో నేను చెప్తున్నానని, ఒకరి కోసం నీవు అంగీకరించవద్దు. నీ మనస్సుకికూడా నచ్చి నీకు మనఃస్ఫూర్తిగా అంగీకారమైతేనే నీవు ఏ నిర్ణయమైనా తీసుకో. టైము కావాలంటే ఆలోచించుకో!" అంది పద్మ తన తప్పు లేకుండా.

రవి రెండో సిగరెట్ ముట్టించాడు. ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తూనే ఉన్నాడు. ఎలా ప్రారంభించాలో తెలియక అలాగే లేని ధైర్యం తెచ్చుకుని, "అక్కా!



మరునాడు ఉదయమే రవి అంజరివద్దా సెలవు తీసుకున్నాడు. కనిపిస్తే గీతకు కూడా చెబుతా మనుకున్నాడు. గీత కనిపించలేదు. ఎంతో నిరాశ పడ్డాడు. మోటారు సైకిలు స్టార్ట్ చేశాడు. ఆనంద్, పద్మ, వగైరా అంతా అతనిని సాగనంపడానికి వరండాలోకి వచ్చారు. గీత కూడా వస్తుందేమోనని రవి ఎంతో ఎదురుచూశాడు. కానీ ... గీత రాలేదు. రవి నిరాశ చెందాడు. ఇంక బాగుండదని అందరికీ "టా! టా!" చెప్పుతూ స్టార్ట్ అయ్యాడు.

మోటారు సైకిలు ట్రంకురోడ్డుపై అతి వేగంగా వెడుతూంది. స్పీడో మీటరు ఎనభై ... తొంభై చూపిస్తూంది. కళ్ళజోడుతో ఉన్న రవి చాలా ఎక్స్‌పర్ట్‌గా డ్రైవ్‌చేస్తూ అతి వేగంగా పోతున్నాడు. అతనికి తెలియకుండానే అతని మనస్సు, "జిందగీ ఏక్ సఫర్ హై సుహానా! ... యహా కల్ క్యా హో కిస్‌నె జానా? ... ? ..." అనే పాట పాడుతూంది. రవి ప్రయాణం అలాగే శరవేగంగా సాగిపోతూంది.

• • •

గీత ఉత్తరం చదువుతూంది కదూ? ఆమె కళ్ళ నుండి నీళ్ళు ధారలుగా వడుతున్నాయి. గతం ఒక్కసారి ఆమెలో గిర్రున తిరిగింది. ఆ బాధ, ఆ ఆవేదన ఆమె తట్టుకోలేక పోతూంది. అలాగే దిగమింగుకుంటూ తిరిగి చదవడం ప్రారంభించింది.

"కనక, గీతా! నీవు నన్ను మనస్సులో అపార్థం చేసుకుని దూషించినా సరే, నేను ఆ నాడు నిజాన్ని దాచలేకపోయాను. నన్ను క్షమించలేవు కదూ? పోనీలే! నువ్వు క్షమించలేకపోయినా, ఆ భగవంతుడే నన్ను శిక్షిస్తాడులే, బాధపడకు! అన్నట్టూ ... ఇక్కడ పాకిస్తాన్‌తో యుద్ధం చాలా ముమ్మరంగా సాగుతూంది, తెలుసా! పేపర్లో చదువుతున్నావా? ఇక్కడ ఒక్క క్షణం తీరిక లేదనుకో. ప్రతి నిమిషం పాకిస్తాన్‌కి ఒక దుర్భర పరాజయం కలిగేలా పోరాడుతున్నాం. అటువంటి క్లిష్ట పరిస్థితులలో నీ పెళ్ళి శుభలేఖ వచ్చింది. నే నెంత సంతోషించానో తెలుసా? నన్ను అభిమానించిన, నేను గౌరవించిన ఒక స్త్రీ ఈనాడు ఒక ఇల్లాలు కాబోతూంది. నాకు ఎంత సంతోషంగా ఉందో! ఆ వార్త మేము అతి త్వరలో పాకిస్తాన్‌పై సాధించబోయే ఘన విజయానికి శుభ సూచకంగా భావించాను, తెలుసా? అయితే, మాకు విజయం తప్పదని నిర్ధారణ అయిపోయింది. రాత్రి అంతా నిర్విరామంగా పోరాటం సాగించి ఇప్పుడే ఒక గంట రెస్ట్ తీసుకుంటున్నాం. సరిగ్గా వేడి టీ తీసుకుంటున్నాను. ఈ లోగా నీ పెళ్ళి శుభలేఖ వచ్చింది. చేతిలో ఉన్న డబుల్ హాట్ 'టీ' నీవు స్వయంగా ఇచ్చిన ట్టనిపించింది. నమ్ముతావా? నీవు చిరంజీవినిగా సౌభాగ్యవతిగా, దీర్ఘ సుమంగళిగా, ముచ్చటైన ముగ్గురు పాపలతో, అనురాగ పూరితమై ఆదరించే భర్తతో మీ ఆదర్శ సంసారం కలకాలం వర్ధిల్లాలని మనఃస్ఫూర్తిగా ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను! దూరాన ఉన్నందువల్ల నీ పెళ్ళికి హాజరుకాలేకపోతున్నందుకు మన్నించు. నా మీద కోపం పోలేదా? న్యాయంగా నీ పెళ్ళికి రావాలని నే నెన్నో కలలు కన్నాను. ఎంతో ఎదురుచూశాను! చూశావా? నిజం ఎంత శక్తివంతమైనదో. నిజానికి ఇక్కడ పాకిస్తాన్‌తో యుద్ధం చాలా హోరాహోరీగా జరుగుతూంది. ఏది ఏమైనా శక్తివంతమైన భారత వీర సైనికుల ధైర్యసాహసాలతో పోటీ చెయ్యగల అర్హత పాకిస్తాన్‌కు లేదు. ఇక రాదు. మేము బ్రతికి ఉండగా అది సాధ్యం కాదు. మేము ఉన్నా, లేకపోయినా భారత విజయం తప్పదు. అదే మా లక్ష్యం. అదే మా అంతిమ కర్తవ్యం! అతి త్వరలో మేము ఘన విజయం సాధించి, ఆ ఆనందోత్సవాలతో నేను తప్పక సెలవు సంపాదించి మీ పుణ్య దంపతులని చూడడానికి మీ ఊరు తప్పక వస్తాను. అప్పుడు నాకు రాగానే 'వేడి— కాఫీ' ఇస్తావు కదూ?

సెలవు!

ఆశీస్సులతో...

—రవి."

గీత ఒళ్ళు జలదరించి చేతులు వణుకుతున్నాయి. కళ్ళన నీళ్ళు నిండిపోయాయి. మనస్సు ఆవేదనతో సతమతమౌతూంది. ఇంతలో పక్క రూమ్‌లోంచి పద్మ వచ్చింది.

ఇంటిల్లిపాదికీ
పండుగచేసే పత్రిక
మహిళాలోకానికి
మహత్తర కానుక!

మహిళ

వెలువడింది!
జూలై '75
వెల: 2 రూ.

సచిత్ర మాస పత్రిక

తొలి సంచిక అలంకారాలు:
వాసిరెడ్డి సీతాదేవి, మాదిరెడ్డి సులోచన, డి. కామేశ్వరి —రసవత్తరమైన కథలు
"రాజకీయ కల్లోలం"లో ఇందిరాగాంధి -ప్రత్యేక వ్యాసం
"అంతర్జాతీయ మహిళా సంవత్సరం" పై తురగా జానకీ రాణి రచన; "స్త్రీలకు ప్రత్యేకం" పి. సరళాదేవి
"అంతరంగ తరంగాలు"-రామలక్ష్మి, లలితా ఆరుద్ర.
కూచిపూడి నాట్యరేఖలను నేలనాలుగు చెరగులా పంచుతున్న కుమారి శోభానాయుడు "నరసశాల" పరిచయం
"వంటమాలచ్మి" — వ్యంగ్య, హాస్య కథానిక

★ రేడియో 'రతన్ ప్రసాద్'తో ఇంటర్వ్యూ,
"ఇల్లు — ఇల్లాలు" "అహంకారానికి మందులేదు"
తెలుగువారి చేనేత కళాసృష్టి - ఫాషన్ పెరేడ్ పోటీలు,
బుల్లి బుల్లి వింతలు, మ్యూజింగ్స్, రాశి ఫలాలు,
సినిమా రంగంలో మహిళలు, చదువులావు- కార్టూన్లు.
"ఆంధ్ర మహిళాసభ" ఏం చేస్తున్నది?
'గర్భిణీ స్త్రీలకు' డాక్టర్ సలహాలు,
ఫాషన్లు, కుట్లు, అల్లికలు, వంటలు

అన్ని చోట్లు సమర్థులైన ఏజంట్లు కావాలి. ★

వివరాలకు: 'మహిళ', 499, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి-517501.

DEVI

"ఏమిటి, గీతా! ఇక్కడ ఒక్కత్తెవు ఏం చేస్తున్నావు! అవతల ఓ మూల ముహూర్తానికి వేళవుతోంది. ఎక్కడిమంచీ ఈ ఉత్తరం? రవి రాశాడా? పెళ్ళికి వస్తున్నాడా?" అంది పద్మ హడావిడిగా. గీత మౌనంగా తల వంచుకుంది.

"ఛ! పిచ్చితల్లీ, అలా బాధపడకూడదు! అవతల ఓ మూల పెళ్ళివారంతా ఉన్నారు! ఏమిటీ కన్నీళ్ళు! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ... పద, పద! ..." అంటూ గీతని పక్క గదిలోకి తీసుకువెళ్ళింది పద్మ.

బయట పెళ్ళి పందిరిలో డోలు, సన్నాయి మంగళ వాద్యాలతో పోటీ పడుతున్నాయి. ఆ వాద్యాలు గీత మనస్సులో మర ఫిరంగులలాగ ధ్వనిస్తున్నాయి. గదిలో ఆడవాళ్ళంతా గీతని పెళ్ళికూతురుగా సింగారిస్తున్నారు. బ్రాహ్మణులు మంత్రాలు గొంతెత్తి ఆలాపిస్తున్నారు. ఇంతలో గీత తండ్రి హడావిడిగా వచ్చాడు.

"అమ్మాయిని తీసుకురండి! ముహూర్తానికి వేళవుతోంది" అనేసి కంగారుగా పెళ్ళి పీటల మీదికి వెళ్ళి కూర్చున్నాడు. పద్మ గీతను వెంటబెట్టుకుని పెళ్ళి పీటల వరకు తీసుకు వచ్చి పీటలపై వరుడు పక్కన కూర్చోబెట్టింది. పురోహితులు మంత్రాలు చదువుతున్నారు. మంగళవాద్యాలు మోగుతున్నాయి.

ఇంతలో ఆనంద్ కంగారుగా పద్మ దగ్గరికి వచ్చాడు. చెవిలో ఏదో చెప్పాడు. పద్మ వెంటనే కంగారుగా ఆనంద్‌తో బాటు బయటకు వచ్చింది. ఆనంద్ ఆవేదనతో తన చేతిలోని 'ఆంధ్రప్రభ' పద్మకి అందించాడు.

పద్మ ఒక్కసారి నిర్ఘాంతపోయింది. గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. చేతులూ, కాళ్ళూ వణికిపోతున్నాయి. అలాగే కంగారుగా మొదటి పేజీలో యూనిఫారంతో ఉన్న రవి ఫొటో చూసింది. మనిషి రాయైపోయింది. అలాగే దుఃఖంతో చదవడం ప్రారంభించింది.

"భారత — పాకిస్తాన్ యుద్ధరంగంలో అఖండ ధైర్యసాహసాలు ప్రదర్శించి అమరవీరుడైన ఆంధ్ర యువకుడు రవీంద్రనాథ్‌కు భారత ప్రభుత్వం 'వీరచక్ర (పోస్తుమస్)' బిరుదుతో సత్కరించి అంతిమ నివాళు లర్పించింది" అని చదివి పద్మ బిత్తరపోయిన హృదయంతో, స్థాణువులా, నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. అక్కడ పందిరిలో సన్నాయి వాద్యాలతో మంగళసూత్రధారణ జరిగింది! ★

# వైద్య విజ్ఞానం

## టిక్స్

**డాక్టర్ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి**

రాజ్‌బాబును చూసి రమాప్రభ కన్ను కొట్టేసరికి అతను అయిపోయి, పెళ్ళి చేసేసు కుంటాడు. కానీ, ఆమె ఎవరిని చూసినా, ఎప్పుడు చూసినా అలాగే కన్ను కొడుతూ ఉండే జాడ్యపు, అది పుట్టుకనుంచీ వచ్చిన అలవాటని తెలుసుకుంటాడు. త్యాగరాజు ఖూనీ చేయబోయే ముందు ఛూయింగ్‌గమ్ అదోరా నములుతాడు. పేకేటి చీటికీ మాటికీ తల ఎగరేస్తూ, ఒక వైపుకు తిప్పుతూ ఉంటాడు. బాలకృష్ణ అడపా దడపా మెడ తిప్పుతూ, గుడ్లు మిటకరిస్తూ ఉంటాడు. రౌడీ రంగారావు మాట మాట్లాడితే మీసం తిప్పుతుంటాడు.

కామాక్షికి కళ్ళార్పటం ఒక దురలవాటయి పోయింది. కన్నయ్య కాళ్ళాడించకుండా క్షణం కూడా ఉండలేడు. ఎప్పుడూ ఏదో లెక్క పెడుతున్నట్టే వేళ్ళు లెక్కిస్తుంటుంది విమల. దగ్గు రాకపోయినా దగ్గటం, ముక్కు చీదుకోవటం, అనవసరంగా తల గోక్కోవటం, కాళ్ళూ చేతులూ అనవసరంగా, అప్రయత్నంగా కదిలించటం, తల ఎగరెయ్యటం, భుజాలు పైకెత్తటం లాంటి అలవాట్లు అనుకోకుండా పట్టుపడతాయి. ఇలాంటి వాటిని "టిక్స్" అంటారు.

నాడీ మండలానికి సంబంధించి, ఒకే రకమైన చలనాలు ఒకే తీరుగా అడపా దడపా వస్తూ ఉంటే, వాటిని 'టిక్స్' అంటారు. ఆ చలనాలు ఒక క్రమాన్ని అనుసరించకపోవచ్చు. అవి అతి వేగంగానూ, శక్తివంతంగానూ ఉండవచ్చు.

5—10 సంవత్సరాల మధ్య పిల్లలలో అలవాటు వల్ల రకరకాల చలనాలు కనబడతాయి. పడిశం పట్టి తగినా పిల్లలు ముక్కు చీదుకోవటం, ఊదటం లాంటివి అలవాటుగా చాలాకాలం పెట్టుకు రావచ్చు. కంటి జబ్బులు తగ్గినా కళ్ళార్చటం తగ్గక పోవచ్చు. వదులుగా ఉన్న నిక్కర్లు పైకి లాక్కోవటం అలవాటైన బాలురు, నిక్కరూ పంట్లామూలూ వదులుగా లేకపోయినా వాటిని పైకి లాక్కునే అభ్యాసాన్ని అధిగమించలేక పోవచ్చు. ఇలాంటివి అలవాట్లలా అనిపించినప్పటికీ వీటన్నింటికీ మానసిక స్థితి నేపథ్యంలో కారణంగా ఉండి తీరుతుంది.

కొందరిలో అకస్మాత్తుగా ముఖ కవళికలు మారుతాయి. బండబూతులు తిట్టటం ప్రారంభిస్తారు. కొందరు చీటికీ మాటికీ దణ్ణం పెడుతుంటారు. చెంపలేసుకుంటుంటారు. నిష్కారణంగా గుండీలు పెట్టడం, తియ్యటం చేస్తుంటారు. రబ్బరు రింగు చేతిలో ఉంటే పదే పదే సాగదీస్తుంటారు. కొందరు పిల్లలు 5 పైసల బిళ్ళలు కనబడితే చాలు గబుక్కున నోట్లో వేసుకుని నములటం మొదలెడతారు. కొన్ని మెదడు జబ్బుల తరవాత పదే పదే ఆవలించటం, గురకతో శ్వాసించటం, రకరకాల చలనాలు చేయటం పరిపాటి.

ఈ చలనాల ముఖ్య లక్షణం ఏమిటంటే, ఇవి ఒక్క అంగానికి మాత్రమే పరిమితమై ఉంటాయి. ఇతర వ్యాధి లక్షణాలలా శరీరాని కంతటికీ వ్యాపించి ఉండవు. కండరాల శక్తి ఏమాత్రం తగ్గదు. ఎంత వేగంతోటే, ఎంత శక్తితోటే ఈచలనాలు సంభవించినా పట్టుతప్పటం, వస్తువులను జారవిడవటం లాంటివి ఎప్పుడూ జరగవు. మామూలు పనులు చేయటకి ఏ విధమైన ఇబ్బందీ రాదు.

పిల్లలకూ, పెద్దలకూ కూడా అలవాటైన ఇలాంటి చలనాలను తప్పించటం ఒక్కొక్కప్పుడు కష్టసాధ్యమైన పనే. ఆరోగ్య రీత్యా తీసుకోవలసిన జాగ్రత్తలను ముట్టమొదట తీసుకోవాలి. ఇంటి వాతావరణంలో, బడి వాతావరణంలో చిన్న చిన్న మార్పులు తెస్తే వెంటనే పిల్లలలో మార్పు రావచ్చు. వీలైనంత వరకూ నయాన చెబితేనే పిల్లలు వింటారు. వారికి ఆప్తులైన వారు సరియైన విధంగా నచ్చజెబితే, మార్పు తప్పకుండా వస్తుంది. వారి అలవాట్లను నిశితంగా విమర్శిస్తే, వారు బిగుసుకుపోతారు. టిక్స్ మరీ ఎక్కువవుతాయి. ఒక్కొక్కప్పుడు టిక్స్‌ను మాన్పటానికి కొన్ని అభ్యాసాలు — ఎక్సర్సైజెస్ — ఉపయోగపడవచ్చు. అద్దం ముందు నిల్చుని చేస్తే, తనలో లోపాలేమిటో, వాటిని ఎలా అతిక్రమించాలో తనకే బోధపడుతుంది. చిన్నపిల్లలలో ఇవి సులువుగా మటుమాయ మవుతాయి. పదిహేను ఏళ్ళకు పైబడిన వ్యక్తులలో ఉంటే వీటిని మాన్పటం చాలా కష్టం. పిల్లలకూ, పెద్దలకూ కూడా మానసిక చికిత్స ఒకొక్కప్పుడు అవసరం కావచ్చు.

కళ్ళార్పే కామాక్షిలోనూ, భుజా లెగరేసే భుజంగరావులోనూ, మెడ తిప్పే మేరీ లోనూ, వేళ్ళు లెక్కించే విమల లోనూ మార్పు రావాలంటే మనం సానుభూతితో వ్యవహరించాలి. నవ్వి, నగుబాటు సంచుచేసి, విమర్శించి విద్వేషాలను పెంచే పక్షంలో పరిస్థితి మరింత విషమిస్తుందని అందరూ గుర్తించాలి. ★

> చర్చికి వెళ్ళే ప్రజలు చట్టబద్ధమైన జీవితం గడిపే వారు కావడం కద్దు.
>
> —ఇ. ఎ. పార్క్